క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సత్యవేడులో విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న సిబ్బంది

సత్యవేడు: సత్యవేడు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షల ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు పంపిణీ పూర్తి చేశామన్నారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 608 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 61 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల కోసం మూడు గదులు, గదుల్లో సీసీ కెమెరాలు, బల్లలు, విద్యుత్, తాగునీరు, ప్రథమ చికిత్స వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు ప్రిన్సిపల్ చెప్పారు.

ఈ ద్విచక్రవాహనం ఎవరిదో?



సంత మైదానంలో ఉన్న ద్విచక్రవాహనం

ఏర్పేడు: స్థానిక బస్టాండ్ పక్కన సంత మైదానంలోని ద్విచక్ర వాహనం ఎవరిదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత 15 రోజులుగా ఏపీ03 పి1809 నంబర్ కలిగిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు సంత మైదానంలో వదలి వెళ్లారు. అప్పటి నుంచి వాహనాన్ని ఇక్కడ ఎందుకు ఉంచారనేది చర్చనీయాంశంగా మారింది. పోలీసులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

- విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం
- ఘనంగా జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం



రేణిగుంటలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న పీడీ జయలక్ష్మి

శ్రీకాళహస్తి రూరల్: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిపేద్దామని శ్రీకాళహస్తి డివిజన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శాంతిదుర్గ అన్నారు. మండలంలోని కాపుగున్నేరి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వారు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను వేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా బీవీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సుధీర్‌కుమార్ విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది ముంతాజ్, అమ్మణ్ణమ్మ, వెంకటసుబ్బయ్య, మునెమ్మ, వాణిశ్రీ పాల్గొన్నారు.

నులిపురుగులను నులిపేద్దాం

సత్యవేడు: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులిమేద్దామని డాక్టర్ గుణశేఖర్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు మండలంలో 7724 మంది పిల్లలకు స్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్లలో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వేస్తున్న ఆల్బెండజోల్ మాత్రలకు, విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ మాత్రలు మింగడం వల్ల కడుపులో ఉండే నులి పురుగులు నశిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌ఎం కిరణ్, ఎంఎల్ పీహెచ్ సుప్రియ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలను వైద్యాధికారి మాధవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో 7039 మంది పిల్లలు ఉండగా, అందులో 6687 మంది పిల్లలకు పంపిణీ చేశామన్నారు. హెచ్‌ఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం నులిపురుగు మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 5905 విద్యార్థులు ఉండగా, 5609 మందికి నులిపురుగు మాత్రలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ గాయత్రి తెలిపారు. వైద్యాధికారి హమీద్, ఎంఈఓ హేమమాలిని, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

ఏర్పేడు: ఆల్బెండజోల్‌తోనే నులిపురుగుల నివారణ అని పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ అభిజ్ఞ అన్నారు. మంగళవారం పాపానాయుడుపేట, ఏర్పేడు పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1 –19 ఏళ్ల లోపు వారికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బైబై వార్మ్స్ అనే ప్లకార్డులు ప్రదర్శించారు. అలాగే ఏర్పేడు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సునీత వాల్ పోస్టరు ఆవిష్కరించి విద్యార్థులకు మాత్రలు మింగించారు. ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని డా.సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో మంగళవారం తొట్టంబేడు సచివాలయం–2 ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కళాశాల కరస్పాండెంట్ డా.సి.రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కంబం యశోద, ఏఎన్‌ఎం సుధ, ఎంసీహెచ్‌పీ భారతి, ఆశావర్కర్ మంజుల పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: రేణిగుంట పాంచాలినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ జయలక్ష్మి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సీడీపీఓ కృష్ణమంజరి, అంగన్‌వాడీ టీచర్ ధనమ్మ పాల్గొన్నారు.



పుదుకుప్పం పాఠశాలలో..



బుచ్చినాయుడుకండ్రిగలో..



కాపుగున్నేరిలో మాత్రల పంపిణీ



తొట్టంబేడులో ..



పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో..



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పిచ్చాటూరు ప్రాథమిక పాఠశాలలో..

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. కేకును కత్తిరించి పంచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ రైల్వేలో మొదటి మహిళా లోకో పైలట్ సురేఖాయాదవ్ అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. జగనన్న ప్రభుత్వం మహిళల రక్షణకు అనేక కఠిన చట్టాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైల్వే మహిళా ఉద్యోగులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, రైల్వే సంఘ్ యూనియన్ నాయకులు బాబు, మాధవి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఏఈ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని హౌసింగ్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ పథకంలో 1828 ఇళ్లు మంజూరు కాగా అందులో కాలనీల్లో 1248 ఇళ్లకు భూమిపూజ చేశామన్నారు. అందులో 51 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా గ్రామాల్లో ఇళ్ల వద్ద వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే 341 ఇళ్లు బేస్‌మట్టం స్థాయికి చేరుకున్నాయని, వీరికి సిమెంట్‌తోపాటు బిల్లులు అందించడం జరిగిందన్నారు. జగనన్న కాలనీల్లో కల్పించనున్న మౌలిక వసతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాదాల తరలింపు వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రసాదాల తరలింపు వాహనాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ముందుగా వాహనానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటులో ప్రసాదాలను తరలించేందుకు ఇబ్బందికరంగా ఉండడంతో రూ.5లక్షలతో బ్యాటరీ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీని వల్ల లడ్డు పోటు నుంచి ప్రసాదాలు తరలించేందుకు సులభంగా ఉంటుందన్నారు. లడ్డు పోటు ఇన్‌చార్జి మునిరెడ్డి, ఆలయ అధికారులు హిమబిందు, సుదర్శన్‌నాయుడు, సుదర్శన్‌రెడ్డి, అర్చకులు కమల్ గురుకుల్, అనిల్‌కుమార్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

అత్యుత్తమ మార్కులు వచ్చేలా చూడాలి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): విద్యార్థులు పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ శివశంకరయ్య అన్నారు. మంగళవారం పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో సాధించే మార్కులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఏ ఉద్యోగానికి, ఇంటర్వ్యూలకు వెళ్లినా అధికారులు ముందుగా పదో తరగతి మార్కుల జాబితా ఆధారంగా విద్యార్థుల ప్రతిభ అంచనా వేస్తారన్నారు. ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు –నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం రవికుమార్, సీఆర్పీ మునస్వామి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

లాభసాటిగా గొర్రెల పెంపకం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

ఏర్పేడు: గొర్రెల పెంపకం లాభసాటిగా ఉంటుందని పాపానాయుడుపేట పశు వైద్యాధికారి మురళి అన్నారు. మంగళవారం కుక్కల గుంటలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పశుసంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

17న మూలవిరాట్ తొలగింపు



వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఈనెల 17న మూలవిరాట్‌ను తొలగించనున్నట్లు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మరింత వేగం పెంచాలన్నారు. శుక్రవారం శ్రీప్రసన్న వరదరాజస్వామి విగ్రహాన్ని భద్రపరచనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, సూర్యప్రసాద్, అర్చకులు శ్రీనివాసశర్మ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు



పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని వివిధ రకాల పనులను 150 మంది కూలీలు చేస్తున్నారు. చెరువుకట్టలపై ముళ్లపొదల తొలగింపు పనులను చేపడుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీకోదండరామాలయంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అధికారులు సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈనెల 22న ఉగాది అస్థానం, 24న గరుడ సేవ, 25న హనుమంత వాహన సేవ జరుగుతాయని వివరించారు. అదే విధంగా ఈనెల 31న శ్రీసీతారాముల కల్యాణం, 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు స్వామి వారి తెప్పోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.